13

**వివిన మూర్తి**

# కాలహరణం





అతడు ఒక మానవుడు.

ఇతడు ఒక మానవుడు.

వారిరువురి శరీర వర్ణములు భిన్నము. ముఖ ఆకృతిలో వ్యత్యాసము.

అది -

ఆర్యులు అని పిలువబడే సమూహము ఒక జాతిగా స్థిరపడుచున్న కాలము.

ఆనాటికి -

మానవ విజ్ఞానము కాలగమనమును గణించుటలో తొలి అడుగులు వేయుచున్నది. చంద్రుని హెచ్చుతగ్గులు మానవ సంబరాలలో భాగమయినవి. కాలము, స్థలము అవగాహన చేసుకోవటం మానవ జీవిత గమనానికి సహాయపడునని గ్రహించాడు మానవుడు. అనంత కాలరేఖలో తొలి బిందువులుగా రాత్రులు, పవళ్ళను ఏర్పరచుకున్నాడు.

కాల సంబంధియైన ఈ గణనాన్ని నేరుస్తున్నవారు శక్తిమంతులుగా గౌరవింపబడుతున్న తరుణము.

× × ×

అట్టి గౌరవము పొందిన బహుకొద్దిమందిలో అతడు ఒకడు.

అతని వాక్కు ప్రమాణముగా స్వీకరింపబడుచున్నది.

అట్టి అతని వద్దకు ఇతను వచ్చి చేతులు జోడించెను.

× × ×

"నాకు విద్య కావలెను-"

"నీవు బ్రాహ్మణుడవు కావు-"

"అనగానేమి?"

"నీవు ఈ విషయమును నేర్వవలెను-"

"తెలుపుడు-"

"సకల చరాచర జీవరాశిలో మానవజన్మము శ్రేష్ఠము. అట్టి మానవ జన్మములో ఆర్యజన్మము సర్వోత్తమము. అట్టి ఆర్యజన్మములో మూడు వర్ణములు ఉన్నవి. ఆ మూడింటిలోనూ బ్రాహ్మణ జన్మము ఉన్నతము. అట్టి బ్రాహ్మణ జన్మము నొందినవారిలో విద్య నేర్చినవారు ఉత్తమోత్తములు."

"అటులనా?"

"నీవు అనార్యుడవు."

"అనే ఆర్యులు అనుచున్నారు."

"అయిననూ నీకు విద్య కావలెను."

"అవును స్వామీ-"

"విద్య ఎందులకు?"

"తెలుసుకొనుటకు?"

"తెలుసుకొనుట ఎందుకు?"

"తెలుసుకొనవలెనని కోరిక ఉన్నందుకు."

"విద్యనేర్చిన నీవు ఆర్యుడవు కాగలనని భావించుచున్నావు-"

"నేనెరిగిన విద్యలు నేర్చిన ఆర్యులు అనార్యులు కాగలరా?"

"బ్రాహ్మణత్వము విద్య ద్వారా ప్రాప్తించునని నీవు ఉన్నతుడవు కావలెనని నీ ప్రయత్నము-"

"ఆ విధముగా నేను యోచించుట లేదు. బ్రాహ్మణత్వము ఉన్నతమని మీరు వచించినారు. అది విద్య ద్వారా సాధింపవచ్చుననియూ మీరే అనుచున్నారు. నా తెలివితేటలు నా సమూహమునకు వినియోగపడిన నాకు సంతృప్తి కలుగును. అట్టి సంతృప్తి ఈ బ్రాహ్మణత్వమను ఉన్నతత్వము కన్న ఉన్నతమైనది."

"నీవు బ్రాహ్మణుడవు కావు. ఆర్యుడవు కావు. అయినను నీకు బుద్ధి కుశలత యున్నది. శరీర దృఢత్వము కలదు. కష్టములకు ఓర్చి విద్యను నేర్చుకొను శక్తి నీకు కలదు-"

"ధన్యుడను-"

"నీవు విద్యార్జనకు అర్హత సాధించవలసి యున్నది-"

"ఏమి చేయవలయును-?"

"నూట ఎనిమిది రాత్రులూ, పవళ్ళూ నాకు సేవచేయవలెను. ఏకాగ్రత సాధించవలెను. సాధనకు అసాధ్యము ఏదియూ లేదు."

"తప్పక చేసెదను. నూట ఎనిమిది రాత్రులూ, పవళ్ళూ ఎట్లు గణించవలెను?"

"గణించి నేను చెప్పెదను. అర్హత సిద్ధించిన పిదప గణనము నేర్పెదను."

"చిత్తము."

× × ×

"ఎన్ని రాత్రుళ్ళు గడచినవి? ఎన్ని పగళ్ళు గడచినవి స్వామీ!"

"గణించుచున్నాను-"

× × ×

అతని భుక్తికి, శరీర సౌఖ్యమునకూ వలసిన ప్రతి భౌతిక పదార్థమూ ఇతడు సమకూర్చుచున్నాడు. సేవచేయుచున్నాడు.

అతడు ప్రతిరోజూ సూర్యోదయమును తదేకదీక్షతో గమనించును. ఒక నక్షత్రమును గురుతుగా ఉంచుకొని సాపేక్షముగా సూర్యోదయము జరుగుటలోని కాలవ్యత్యాసమును గణించుకొనుచుండును. పవలు తన నీడ పొడవును అందులో హెచ్చుతగ్గులను గ్మమనించును.

అతను చేయుచున్నదంతయూ ఇతడు కన్నార్పకుండా చూచును.

ఇతని బుద్ధియంతయూ అతని వేషభాషలను, ఆహారవిధానమునూ, నడవడికనూ గమనించుట యందే నిమగ్నమాయెను.

కొంతకాలమునకు అతడు తనకన్న అధికుడను చేతన ఇతనిలో ఆరంభమయినది.

ఇతడు చాకిరికి వెరచుట లేదు. తను ఎరిగినవి మరుచుటకు సంకోచించుట లేదు. నూట ఎనిమిది రాత్రులూ, పగళ్ళూ పూర్తియగుట కొరకు ఎదురుచూచుచున్నాడు. లభింపబోవు అర్హత కొరకు, ఆ మీదట నేర్వబోవు విద్య కొరకు అతని నిరీక్షణ కొనసాగుచున్నది. ఇతడు చిక్కిసగమయినాడు.

'ఇంకా ఎన్ని రాత్రిళ్ళు గడవవలెను? ఎన్ని పగళ్ళు గడవవలెను?'

ఇతడు ప్రశ్నించుచునే యున్నాడు.

'గణించుచున్నాను. గణనము పూర్తియయిన పిదప తెలిపెదను.'

అతడు వచించుచునేయున్నాడు.

ఇతనికి మృత్యువు సమీపించెను.

అతడు ఇతనిని సమీపించెను.

సజలనయనాలతో ఇతడు మరణశయ్య నుండి అతనిని ఎగాదిగా చూచెను.

"నాలెక్క ఎన్నడు పూర్తియగును స్వామీ!" అనుచున్నవి ఇతని చూపులు.

"నాయనా! నా గణనము పూర్తి అయినది. నూట ఎనిమిది పగళ్ళు పూర్తి అయినవి. నూట ఎనిమిదవరాత్రి గడచుచున్నది. నీకు అర్హత లభించనున్నది. నీ ఈ జన్మము వృధా పోదు. మరికొన్ని రాత్రిళ్ళు పగళ్ళు నీకు మిగిలియున్న ఈ విద్య నేనే ఆరంభింతును. జ్ఞానము నేనే దానము చేసెదను. లేకున్న వచ్చే జన్మమున నీకు ఆర్యజన్మము లభించును. బ్రాహ్మణ వర్ణమున జనించెదవు. పుట్టుకతోనే నీకు విద్యార్హత లభించును" అన్నది అతని గొంతు.

ఆ రాత్రి ముగియకముందే ఇతను ముగిసెను.

× × ×

అతడు గాయత్రీ జపము ఆరంభించెను.

....యదహ్నాత్ కురుతే పాపమ్ తదహ్నాత్ ప్రతిముచ్యతే

యద్రాత్రియాత్ కురుతే పాపమ్ తద్రాత్రియాత్ ప్రతిముచ్యతే...

ఏ రాత్రి చేసిన పాపములు ఆ రాత్రే పోవలెను. ఏ పగలు చేసిన పాపములు ఆ పగలే పోవలెను... అని నక్షత్రములు పూర్తిగా పోకుండా సూర్యోదయము జరుగబోవు ఉత్తమోత్తమ సంధ్యా సమయములో అతడు గాయత్రిని వేడుకొనసాగెను.

ఆ గాయత్రి సైతము తనకు చేయు జపము నూట ఎనిమిది మార్లు అను లెక్కకొరకు ఆ మానవుని మీదనే విశ్వాసముంచెను.

ఆనాటి చిరుజ్ఞానము ఆరంభించిన మాయ చిరంజీవి అయినది.